

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి









ఏలేశ్వరంలో ఆటో నడుపుతున్న మంత్రి నారాయణ, వెనుక సీట్లో ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీ రాజశేఖరం.. అక్కడే ఆటో నడుపుతూ ఎంపీ సానా సతీష్, పక్కన కలెక్టర్ షాన్‌మోహన్... పిఠాపురంలో ఆటో నడుపుతున్న ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడలో సిటీ ఎమ్మెల్యే కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, సామర్లకోటలో పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప..

'ఆటో' జోష్!

ఆటో డ్రైవర్ల అండగా ప్రభుత్వం

- 'ఆటో డ్రైవర్ల సేవలో..' కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి నారాయణ
- కాకినాడ జిల్లావ్యాప్తంగా 12,966 మందికి రూ.19.44 కోట్లు
- నగదు పంపిణీని ప్రారంభించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్
- ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తిన ఎంపీ, ఎమ్మెల్యేలు.. అంతటా ఇదే సందడి


ఏలేశ్వరంలో శనివారం 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

ఏలేశ్వరం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం కాకినాడ జిల్లా ఏలేశ్వరం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారాయణ విచ్చేశారు. అలాగే ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఎమ్మెల్సీ రాజశేఖర్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులతో నిర్వహించిన సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో ఆటో డ్రైవర్ల సేవా పథకం లేకపోయినా ప్రభుత్వం డ్రైవర్ల కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతీ సంవత్సరం లబ్ధిదారులకు రూ.15 వేలు నేరుగా వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. తొలుత ప్రజాప్రతినిధులు మూడు కిలోమీటర్ల మేర ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సహా ప్రజాప్రతినిధులంతా ఖాకీ చొక్కాలు ధరించి ఆటోలు నడిపారు. అనంతరం ఆటోడ్రైవర్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, టీడీపీ నాయకులు తోట నవీన్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంతో అట్టహాసంగా..

'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకాన్ని శనివారం ప్రారంభించడంతో జిల్లావ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఎంతో ఉత్సాహంగా కనిపించారు. ప్రధాన కూడళ్ల వద్ద ఎక్కడ చూసినా ఇదే చర్చ. ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు ఏటా వేస్తామని కూటమి ప్రభుత్వం ఆకస్మికంగా ప్రకటించింది. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల తమ ఉపాధి దెబ్బతిందని ఆవేదన వ్యక్తంచేస్తున్న ఆటో కార్మికులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ప్రకటించిన విషయం తెలిసిందే. దసరా సందర్భంగా ఈ సొమ్మును అందజేస్తామని తెలియజేసినట్టుగానే అర్హులైన వారందరికీ ఆ సొమ్ములను బ్యాంకుల్లో జమచేశారు. జిల్లాకు వచ్చేసరికి ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ వాహనాలు నడిపే 12,966 మంది డ్రైవర్లకు రూ.19 కోట్ల 44 లక్షల 90 వేలు జమ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. కాకినాడ అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి 1938 డ్రైవర్లకు రూ.2 కోట్ల 90 లక్షల 70 వేలు వారి అకౌంట్లలో జమచేసినట్టు వెల్లడించారు. జిల్లా అంతటా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం జమ కావడంతో అందరిలో ఎంతో ఉత్సాహం నెలకొంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పలుచోట్ల పాలాభిషేకాలు నిర్వహించారు.

ఆటో నడిపిన ఎంపీ తంగెళ్ల

పిఠాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ శనివారం ఆటో నడిపారు. పిఠాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన పట్టణంలోని పాదగయ సెంటర్‌లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులను ఆటోలో ఎక్కించుకున్నారు. ఖాకీ చొక్కా తొడుక్కుని అక్కడి నుంచి ఆటో నడుపుతూ అంబేడ్కర్ భవన్‌కు చేరుకున్నారు.




పిల్లలు ఒక్కసారి దగ్గినా, కొద్దిగా ముక్కు కారినా వెంటనే మందు వేసేయాల్సిందే. నెలా, రెండు నెలల వయసైనా ఇదే పద్ధతి. ఇది చాలా ప్రమాదమని వైద్యులు చెప్పినా వినిపించుకోని వాళ్లు చాలామంది ఉన్నారు. పసివాళ్లకు కాస్త నలత చేసిందంటే ఇంట్లో కలత మొదలవుతుంది. వాళ్లు నోరు తెరిచి చెప్పలేరు. పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇన్ఫెక్షన్లు ఎలా వస్తాయో అలానే తగ్గిపోతాయని వైద్య నిపుణులు చెప్పే సత్యం. కానీ శరీరం సర్దుబాటు చేసుకునే సమయం ఇవ్వడమే ఇక్కడ కీలకాంశం. వాస్తవానికి కాఫ్ సిరప్‌లు పనిచేయడానికే నాలుగు రోజుల సమయం పడుతుందట. వాటికంటే ఆవిరి పడితే చాలావరకూ వేగంగా కోలుకుంటారని పిల్లల వైద్యులు చెబుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని చిన్నారుల మరణం ప్రస్తుతం దేశాన్ని కుదిపేస్తోంది. రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడొద్దని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.
- (రాజమహేంద్రవరం/గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)

చిన్నారులకు.. మందులు..వద్దు!

నలత చేసినా.. కలత పడొద్దు..

ఈ మందులు వాడితే ప్రమాదమే..

జలుబు, దగ్గు వంటి ఇన్ఫెక్షన్లకు డీకంజెస్టెంట్లు, యాంటీ హిస్టామైన్, డెక్స్‌ట్రామెథార్‌ఫన్ కాంబినేషన్ల మందులను డాక్టర్లు సిఫారసు చేస్తుంటారు. వాటివల్ల దారుణమైన ప్రతికూలతలు ఉన్నాయి. అవి నేరుగా మెదడుపై ప్రభావం చూపడంతో పిల్లలు మూర్ఛకు గురవుతారు. మగతగా ఉంటారు. గుండె కొట్టుకొనే వేగం పెరిగి మరణానికి దారి తీస్తుంది. మల విసర్జితానికి ఇబ్బంది కలుగుతుంది. పిల్లలు చిరాకు, ఆందోళనగా ఉండి నీరసించి పోతారు. డెక్స్‌ట్రామెథార్‌ఫన్, గ్వైఫెనిసిన్ వల్ల ఎక్కువగా అలా జరుగుతుంది. కానీ మనం రోగం పెరుగుతున్నా తగ్గుతోందని అనుకొని ఆ మందులనే బలవంతంగా పట్టించేస్తాం.

సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం..



చిన్నారులతోపాటు పెద్దల్లో సెల్ఫ్ మెడికేషన్ ప్రమాదకరం. ఒకసారి డాక్టరు సూచించిన మందులను నిర్ణీత వ్యవధి దాటిన తర్వాత తరచూ వాడడం వల్ల దుష్ప్రభావం చూపే అవకాశాలు అధికం. వైద్యులు ఏదైనా మందును సూచించినప్పుడు మోతాదు ప్రకారం వాడాలి. చిన్నారుల సిరప్‌లు, డ్రాప్స్‌ను తెరిచిన తర్వాత 21 రోజుల్లోగా వాడాలి. ఆ తర్వాత వాడితే ఇబ్బందికరమే. వైద్యుల సలహా లేకుండా మందులు వాడడం వల్ల చిన్నారుల్లో మెటబాలిజం దెబ్బతినే ప్రమాదముంది. చిన్నారులకు ఏ ఇబ్బంది ఉన్నా వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ విజయశేఖర్, చంటి పిల్లల వైద్య నిపుణుడు, ప్రభుత్వాసుపత్రి కాకినాడ

మూడు రోజులు చూడాలి



దగ్గు, జలుబు వంటి ఇన్ఫెక్షన్లు వస్తే తక్షణమే మందులు అవసరం లేదు. కాచి చల్లార్చి గోరు వెచ్చగా తేనె నీళ్ల (ఏడాది దాటాక), తేనె లవంగం నీళ్లు, ఆవిరి పట్టడం వంటివి చేయవచ్చు. మూడ్రోజుల తర్వాత కూడా దగ్గు వస్తుంటే డాక్టరును సంప్రదించాలి. అవసరం అనుకుంటే వారి పర్యవేక్షణలోనే తగు మోతాదులో మందులు వాడాలి. డెక్స్‌ట్రామెథార్‌ఫన్ నాలుగేళ్లలోపు పిల్లలకు వాడకూడదు. మందుల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం.

- కొండా ఉమా శివరామకృష్ణ, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, రాజమండ్రి

వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా రోగాలు వస్తుండడం సర్వసాధారణం. ఐదేళ్ల లోపు పిల్లలకు దగ్గు, జలుబు మందులు వాడాల్సిన అవసరం ఉండదు. వైరల్ ఇన్ఫెక్షన్లు కావడంతో మందులతో పెద్దగా ఫలితం ఉండదు. కానీ కొందరు డాక్టర్లు ఏవేవో కాంబినేషన్లతో కూడిన మందులు రాసేస్తారు. చాలామంది మందుల షాపు నుంచి కొనుక్కొని వాడేస్తుంటారు. ఇటీవలకాలంలో చిన్నారుల్లో మందుల వినియోగం గణనీయంగా పెరిగింది. మూడేళ్ల కిందటితో పోల్చుకుంటే చిన్నారుల మందుల విక్రయాలు దాదాపు 75 శాతం పెరిగినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇది ప్రమాదకర స్థితిని సూచిస్తోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇటీవల పెద్దలు తాగే దగ్గు సిరప్‌ను చిన్నారులకు పట్టగా 11 మంది చనిపోయారు. జైపూర్‌కు చెందిన కేసన్స్ అనే సంస్థ తయారుచేసిన సిరప్ వల్ల ఈ మరణాలు సంభవించినట్టు గుర్తించారు. ఈ సిరప్‌లు నాణ్యతా లోపంతో ఉండడంతోపాటు చిన్నారులకు, పెద్దలకు ఒకే విధమైన సిరప్‌లను మార్కెట్‌లో ఉంచడంతో ప్రాణాపాయం ఏర్పడిందని పరీక్షల్లో తేలింది. ఈ నేపథ్యంలో కేంద్రం సూచనల మేరకు వైద్య- ఆరోగ్య శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అప్రమత్తమయ్యాయి.

దగ్గు వస్తే ఇలా చేసి చూడండి..

రెండేళ్లలోపు వయసున్న చిన్నారుల్లో జలుబు, దగ్గు వచ్చినా మందులు ఇవ్వడం కానీ, సూచించడం కానీ చేయవద్దని కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీచేసింది. ఎలాంటి మందులు వాడకుండానే దగ్గు తగ్గిపోయే అవకాశాలే అధికంగా ఉంటాయని కేంద్రం తెలిపింది. పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం వంటివి సోకితే తగిన విశ్రాంతి ఇవ్వాలి. శరీరంలో సహజంగా ఉండే వ్యాధి నిరోధక శక్తి ఇన్ఫెక్షన్‌పై దండెత్తి తరిమి కొట్టే సమయం ఇవ్వాలి. గోరు వెచ్చని ద్రవాలను వైద్యుడి సలహాతో పట్టించవచ్చు. 12 నెలల కంటే ఎక్కువ వయసు పిల్లలకు నిద్ర సమయానికి ఓ అర గంట ముందు కొద్దిగా తేనె కలిపిన గోరువెచ్చని నీళ్లు పట్టించడం వల్ల దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. మూడు రోజులు చూసిన తరువాత చిన్నారుల్లో వచ్చే దగ్గు, రొంప తదితర వ్యాధులకు వైద్యులను సంప్రదించాలి. వెంటనే అవసరం ఉండదు.

- మితిమీరిన మందులు హానికరమే
- దగ్గు, జలుబు సిరప్‌ల వల్ల నష్టాలు ఎక్కువే
- రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో 11 మంది మృతి
- పిల్లలకు మందులు వద్దని కేంద్రం ఆదేశం
- పెద్దల మందులు వాడేసినా ప్రమాదమే



ఇలా వాడొద్దు..

చిన్నారుల్లో జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు, వాంతులు ఎక్కువగా వస్తుంటాయి. ప్రతి నెలా చిన్నారులను వైద్యులు వద్దకు తీసుకెళితే వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా మందులు మార్పు చేస్తారు. అలా చేయకుండా ఒకే రకమైన మందులను రెండు, మూడేళ్ల వరకు వినియోగిస్తున్నారు. డ్రాప్స్ స్థానంలో పీడియాట్రిక్ సిరప్‌లు, అవి అందుబాటులో లేకుంటే పెద్దల సిరప్‌లు వినియోగించే వారు అధికం.లేకుంటే మెడికల్ షాపులు, ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లి వారు సూచించిన మందులను వాడేస్తున్నారు. ఇప్పుడు ఇదే ప్రమాదకరంగా మారింది. దగ్గు, రొంప, జ్వరం వచ్చినప్పుడు ఆరేళ్లలోపు చిన్నారులకు పెద్దల మందులను డోస్ తగ్గించి వాడితే సరిపోతుందనే భావన సరికాదు. చిన్నారులు, పెద్దలు ఎవరైనా సరే వైద్యులు సూచించిన మోతాదులోనే మందులను వినియోగించాలి.

ఏపీపీ రాత పరీక్షకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు : ఎస్పీ

కాకినాడ క్రైం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల నియామకానికి సంబంధించిన రాత పరీక్షను ఆదివారం కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన భద్రతా చర్యలను ఎస్పీ జి.బిందుమాధవ్ శనివారం పర్యవేక్షించి పోలీసు అధికారులకు భద్రతపై దిశానిర్దేశం చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ఠ బందోబస్తు, పరీక్ష హాళ్లలో, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అభ్యర్థులు సమయపాలన పాటించి హాల్ టికెట్లు, గుర్తింపు కార్డులతో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని ఎస్పీ సూచించారు. ఆయన వెంట కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఉన్నారు.


చెక్కును కలెక్టర్‌కు అందిస్తున్న దృశ్యం

ఎఫెక్స్ ఫ్రోజెన్ విరాళం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ మూవ్‌మెంట్-టచ్ స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకులకు ఉచిత భోజనాల నిమిత్తం రూ.18 లక్షల చెక్కును ఎపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్య చౌదరి కలెక్టర్ షాన్‌మోహన్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ఆర్‌లో భాగంగా ఈ నిధులు ఇచ్చామన్నారు. జీజీహెచ్‌లో ఇప్పటి వరకు మధ్యాహ్న భోజనమే ఉచితంగా పెట్టేవారని, ఇప్పుడు ఎపెక్స్ ఫ్రోజెన్ సహకారంతో రాత్రి భోజనం పెడతారన్నారు. దాతలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే స్టేషన్లకు అమృతం!

జోరుగా సాగుతున్న 'అమృత్ భారత్' పనులు

- కాకినాడ స్టేషన్ ఆధునికీకరణ
- అధునాతనంగా ముస్తాబు
- రూ.21.13 కోట్లు కేటాయింపు
- సరికొత్త హంగులు ఏర్పాటు
- మారిన రూపురేఖలు


ముస్తాబైన కాకినాడ టౌన్ స్టేషన్

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్లో అమృత్ భారత్ పథకం పేరిట చేపట్టిన అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని, సామర్లకోట, కాకినాడ టౌన్, రాజమహేంద్రవరం, నిడదవోలు వంటి ప్రధాన స్టేషన్లలో ఈ పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అధునాతన సౌకర్యాలు, ఆధునిక హంగులతో ముస్తాబవుతున్నాయి. కాకినాడ టౌన్ స్టేషన్ అభివృద్ధి పనులకు రూ.21.13 కోట్లు కేటాయించారు. ప్రారంభంలో నిధుల జాప్యంతో కొంత కాలం పనులు నత్తనడకన సాగాయి. ప్రస్తుతం వేగవంతంగా జరుగుతున్నాయి. ప్లాట్‌ఫాంల ఆధునీకరణ పూర్తయింది. ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రస్తుతం ఉన్న భవనాలతో పాటు అదనంగా మరో రెండు భవనాలను నిర్మించారు. ముఖద్వారాలను, స్టేషన్ పరిధిలోని గోడలను అందంగా తీర్చిదిద్దే పనులు పూర్తి కావొచ్చాయి. క్యూలైన్లో నిల్చొనే అవసరం లేకుండా ప్రయాణికులు వెంటనే టికెట్ పొందేందుకు కౌంటర్ వద్ద ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ ఏర్పాటు చేశారు. పాత బల్లలు పూర్తిగా తొలగించి స్టీలు కుర్చీలు ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫాం పై భాగంలో కొత్త షెడ్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు కొత్త షెడ్లు వేశారు. మరింత నాణ్యమైన పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, అధునాతన ఎల్‌ఈడీ బోర్డులను అమర్చారు. ఫుడ్‌కోర్టులు, రైళ్ల రాకపోకల వివరాలు తెలిపే సైన్‌బోర్డులను ఏర్పాటు చేశారు. స్టేషన్ ఆవరణ మొత్తం కాంతివంతంగా ఉండేలా లైట్లు బిగించారు. స్టేషన్ ఆవరణలోని డివైడర్‌ను పూర్తిగా తొలగించారు. ఐరన్ గ్రిల్స్‌ను అటు ఇటూ వేసి మధ్యలో మొక్కలు పెంచేలా బ్యూటిఫికేషన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. రామారావు పేట వైపు ఉన్న స్టేషన్ ముందు భాగం పూర్తి రూపురేఖలు మారిపోయాయి. ఆ రహదారిని మొత్తం విశాలవంతమైన ప్రాంగణంగా మార్చేశారు. పార్కింగ్‌కు అనువుగా స్థలం పెంచారు. పచ్చదనాన్ని పెంచేలా,వాటర్ ఫౌంటెయిన్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులు వేచి ఉండే హాళ్లకు అదనంగా మరో రెండు గదులు నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి.సరికొత్తగా ఫుట్‌పాత్ ఆధునీకరణ, ఫ్రంట్ ఎలివేషన్, స్టేషన్ ఆవరణలో సెంట్రల్ లైటింగ్, పెయింటింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో తొలుత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని, కాకినాడ టౌన్, నిడదవోలును ఎంపిక చేశారు. 2023 ఆగస్టు ఆరో తేదీన ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.వార్షికాదాయం రూ.20 కోట్లకు పైగా ఉన్న ఈ మూడు స్టేషన్లతో పాటు జిల్లాలోని సామర్లకోట, రాజమహేంద్రవరం స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు.

దీపావళి నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, సురక్షితమైన వాతావరణంలో జరుపుకునేలా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులకు సూచించారు. ఈనెల 20న దీపావళి నేపథ్యంలో శనివారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గత నెలలో వినాయకచవితి, దసరా పండగలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో దీపావళిని విజయవంతం చేయాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పండగ సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై జిల్లా అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పోస్టర్ రూపొందించి బాణసంచా విక్రయ షాపుల వద్ద ప్రదర్శించాలన్నారు. అనుమతి లేకుండా బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలు నిర్వహించకుండా రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలు నిశితమైన నిఘా పెట్టాలన్నారు. అనుమతి పొందిన కేంద్రాలు ప్రామాణిక జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలన్నారు. దీపావళికి మూడు రోజులు ముందు మాత్రమే బాణసంచా విక్రయాలను నిర్దిష్ట వేళల్లో అనుమతించాలన్నారు. దుకాణాలను సురక్షితమైన, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయడానికి ఈనెల 15వ తేదీలోపు గుర్తించాలన్నారు. ఒక్కో లేఔట్‌లో 50 దుకాణాలు మించకుండా రూపొందించాలన్నారు. అన్ని విక్రయ కేంద్రాల వద్ద అగ్నిమాపక పరి కరాలు, నీటి డ్రమ్ములు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. విక్రయదారులు అధిక ధరలకు విక్రయించకుండా లీగల్ మెట్రాలజీ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట్రావు, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీ రాజేష్, డీపీవో రవి కుమార్, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ల సేవ'లో ప్రజాప్రతినిధులు..



కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఆటో కార్మికులకు చెక్కు అందజేస్తున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ. చిత్రంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆటో కార్మికులకు చెక్కు అందజేస్తున్న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ఆటోడ్రైవర్లకు ఆర్థికసాయం పంపిణీ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ నాయకులు

హర్షాతిరేకాలు

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు సభలు నిర్వహించి ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేశారు. కూటమి ప్రభుత్వం తమకు ఆర్థిక భరోసా ఇచ్చిందని పలువురు డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. వారి సంతోషం వారి మాటల్లోనే....



కాకినాడలో ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

ఆటోవాలాలకు ఎంతో మేలు

శెట్టి శ్రీను, వేట్లపాలెం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 శాతం నుంచి 30 శాతం తగ్గింది. అంతకు ముందు నిత్యం రూ.700 నుంచి రూ.1,000 వచ్చేది. ఇప్పుడు రూ.500-రూ.700 మధ్య మాత్రమే వస్తోంది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ఆటోవాలాలకు ఎంతో మేలు చేకూరుస్తుంది.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

పటాన్ బాజీ, లక్ష్మీపురం, దేవరపల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా



ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడంతో ఆటో డ్రైవర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతం ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.10వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం మా ఖాతాల్లో రూ.15వేలు జమ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు.

సీఎం మా కష్టాన్ని గుర్తించారు

ఆర్.గిరీష్ కన్న, పోతవరం, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా



గత ప్రభుత్వంలో ఏడాదికి కేవలం రూ.10వేలు ఇచ్చేవారు. అవి ఆటో ఫిట్‌నెస్‌కి సరిపోయేవి కావు. రూ.5వేలు అప్పు చేయాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు మా కష్టాన్ని గుర్తించి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించారు.

ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుంది

మోకా వెంకటేశ్వరరావు, అయినాపురం, ముమ్మిడివరం మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల మాకు కొంత నష్టం కలిగింది. రూ.15వేలతో ఆ నష్టం భర్తీ అవుతుంది. ఆటో కార్మికులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇంది ఎంతో ఉపయోగం. సొమ్ము అవసరమైనప్పుడు ప్రైవేటు ఫైనాన్సర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం తప్పింది.

ఎంతో ఆనందంగా ఉంది

ములికి సూరిబాబు, తుని ఏరియా ఆటో యూనియన్ ప్రెసిడెంట్



ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పకపోయినా, ఆదుకుంటామని ఎటువంటి హామీ ఇవ్వకపోయినా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించి ఆర్థిక సహాయం అందజేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. కూటమి ప్రభుత్వానికి అన్ని విధాలా రుణపడి ఉంటాం.

కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది

గెద్దం శేఖర్‌బాబు, ములికిపురం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



ఈ పథకం మాకు ఎంతో తృప్తి ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. సూపర్-6 పథకాల్లో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం లేకపోయినప్పటికీ మా ఇబ్బందులను గమనించి రూ.15వేలు కేటాయించడం ఆనందంగా వుంది.

చిన్నచిన్న మరమ్మతులు చేయించుకుంటాను

కోపెల్ల శ్రీను, తీపర్రు, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా



రూ.15వేలతో నా ఆటోకు అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాను. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవడానికి ఉపయోగిస్తాను. ప్రభుత్వం ఈ సాయం చేయకపోతే బయట అప్పు చేసి వాటిని చేయించాల్సి వచ్చేది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు రుణపడి ఉంటాం.

కూటమి ప్రభుత్వం అండ

పైల వీరబాబు, ఏలేశ్వరం, కాకినాడ జిల్లా



స్త్రీ శక్తి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఆటోపై ఆధార పడి జీవనం సాగిస్తున్న మాకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానిక నాయకులు మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించడం చాలా సంతోషదాయకం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక భరోసాను, అండను ఎన్నటికీ మరువలేం.

థాంక్యూ... సీఎం సార్

చౌదరి, కాకినాడ పాత బస్టాండ్



ఆటోయే మా కుటుంబానికి జీవనాధారం. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. అప్పట్లో ఇచ్చిన రూ.10వేలు కూడా ఆటోల మరమ్మతులకే సరిపోయేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. రూ.15వేలు సాయం అందించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.

ఒటన్ నొక్కగానే డబ్బులు పడ్డాయి

ఆర్.రాజు, కాకినాడ



సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట మాట నిలబెట్టుకున్నారు. అమరావతిలో బటన్ నొక్కగానే ఇక్కడ వెంటనే నా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయి. చాలా ఆనందించాను.

మా కుటుంబాల్లో వెలుగులు

బూరుగు కల్యాణ్, క్రాపచింతలపూడిపాలెం, ముమ్మిడివరం మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



ఆటో డ్రైవర్ల సేవలో పథకం చాలా బాగుంది. ఎంతో మంది ఆటోవాలాల జీవనోపాధికి ఇది మేలు చేస్తుంది. ఎన్నికల ముందు ఎటువంటి హామీ ఇవ్వకపోయినా మా ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకున్నారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపుతాయి.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

రూ.53.41 లక్షల ఆదాయం



శ్రీవేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి అర్చకులు సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. వివిధ సేవల ద్వారా స్వామికి రూ.53.41 లక్షల ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

వాలీబాల్ క్రీడాకారుడు పూజలు

వెంకన్న ఆలయంలో శనివారం తాడిపూడికి చెందిన అంతర్జాతీయ వాలీబాల్ అండ్ బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు ముదునూరి చలపతి రామకృష్ణంరాజు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన తెలంగాణ రాజధానిలో కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వామి చిత్రపటం అందజేశారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



క్రీడాకారుడికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వాస్తవికతకు అద్దం పట్టేలా జోగేష్ కవిత్వం

లిథియా పూలు-సలామీ అఖాతం కవితా సంపుటి ఆవిష్కరణ



లిథియా పూలు-సలామీ అఖాతం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

అమలాపురం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్వీయ అనుభూతితో బడుగు భాస్కర జోగేష్ రాసిన కవిత్వంలో సౌందర్య దృష్టికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని.. ప్రాపంచిక, వాస్తవికత పట్ల అంతే ఎరుకతో రచన సాగించారని ప్రముఖ కవి, రచయిత నామాడి శ్రీధర్ పేర్కొన్నారు. కవి, తన బాల్య, యవ్వన కాలాల జ్ఞాపకాలతో పాటు సామాజిక ఘటనలు, రాజకీయ పరిణామాలను కవిత్వీకరించారని ఆయన ప్రశంసించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బార్ అసోసియేషన్ భవనంలో శనివారం కవి భాస్కరజోగేష్ రచించిన కవితా సంపుటి 'లిథియా పూలు-సలామీ అఖాతం' ఆవిష్కరణ సభలో ఆయన పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి సభకు అధ్యక్షత వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్ కుమార్ చేతులమీదుగా జోగేష్ మాతృమూర్తి ఈశ్వరమ్మకు తొలి ప్రతిని అందించారు. ప్రధాన వక్త, కవిసాహిత్య విమర్శకులు సుంకర గోపాల్ మాట్లాడుతూ లిథియా పూలు-సలామీ అఖాతం కవిత్వ సంపుటిలో అనుభూతి, భావుకత, సామాజిక పరిణామాల చిత్రీకరణ ఉందన్నారు. ఒక తాత్విక ధార్మిక దృక్పథంతో పాటు గాఢత స్పష్టత ఉన్న అరుదైన కవిగా జోగేష్‌ను కొనియాడారు. మరో రచయిత అవధానుల మణిబాబు మాట్లాడుతూ జోగేష్ కవితా సంపుటిని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, దాట్ల దేవదానంరాజు, కోడూరి రామరాజు, ఎంఎస్ సూర్యనారాయణ, మిరప మహేష్, మోకా రత్నరాజు తదితరులు ఆత్మీయ వచనాలు చెప్పారు. కవి బడుగ భాస్కరజోగేష్ తన కవితా నేపథ్యాన్ని వివరించారు. మధునాపంతుల చలపతి, ముక్కామల చక్రధర్, చెల్లి రవిగౌరస్, ముత్యాల శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్, అడపా ప్రసాద్, నంబూరి మూర్తి, కుడుపూడి అశోక్, వనుము చంద్రశేఖర్, నందెపు శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డులో కారుపర్తికి అవకాశం



కారుపర్తి నాగ మల్లేశ్వరరావు

అంబాజీపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగ మల్లేశ్వరరావుకు అవకాశం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటించిన ఉత్వర్వులో ఆయన్ని ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించారు. గత 35 ఏళ్లుగా ఆయన సిద్ధాంతిగా ఉన్నారు. పుల్లేటికుర్రులోని ఆలయాన్ని సొంతంగా నిర్మించిన ఏటా వైభవోపేతంగా పూజలు నిర్వహిస్తారు. అలాగే ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కుటుంబానికి ఆయన వ్యక్తిగత సిద్ధాంతి. అలాగే ఆయన పంచాగాలు రూపొందించి దేశ, విదేశాల్లో ఆవిష్కరించారు. ఆయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఉమ్మడి జిల్లా దివ్యాంగుల పారా స్విమ్మింగ్ పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దివ్యాంగుల పారా స్విమ్మింగ్ పోటీలు జరగనున్నాయి.ఏలూరులో ఈనెల 12న 7వ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025 జరగనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి గల దివ్యాంగ క్రీడాకారులు ఆదివారం ఉదయం 9 గంటలకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్ వద్దకు హాజరుకావాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ కాకినాడ జిల్లా ఇన్చార్జి ప్రెసిడెంట్ వి.రామస్వామి, సెక్రటరీ సాబీర్ కోరారు. మరిన్ని వివరాలకు 9390131777, 8121394478లో సంప్రదించాలని కోరారు.

అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శనివారం రెజ్లింగ్, స్క్వాష్, మోడరన్ పెంటాతలను విభాగాల్లో బాల, బాలికల ఎంపికలు జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కే.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీలు ఎల్ జార్జ్, కె.పట్టాభిరామం వై.బంగారు రాజు, టైక్వాండో జిల్లా కార్యదర్శి అరుణ్ రావు ఆధ్వర్యంలో ఈ ఎంపికలు నిర్వహించారు. అదేవిధంగా రాజా ట్యాంక్‌లో ఉన్న స్కేటింగ్ రింగ్‌లో స్కేటింగ్ అండర్ 14, 17 బాల బాలికల ఎంపికలు జరిగాయి.

7న ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న జరుగుతుందని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి నాలుగు జిల్లాల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. ఈ ఏడాది జూలై 2, సెప్టెంబరు 10 తేదీల్లో నిర్వహించిన సమావేశాల యాక్షన్ టేకెన్ రిపోర్టు కూడా తీసుకురావాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఆలమూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానఅగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ అందించిన సమాచారం ప్రకారం.. రావులపాలెం మండలం ఊబలంక శివారు తోకలంక గ్రామానికి చెందిన గుత్తుల విజయరాజు(30) నర్సరీ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు అడపా అప్పారావు కన్నుమూత



అప్పారావు (ఫైల్)

అమలాపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం పాత్రికేయునిగా పనిచేసిన అడపా అప్పారావు(78) శనివారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అమలాపురంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. 'ఆంధ్రజ్యోతి' సహా వివిధ దినపత్రికల్లోను, టీవీ చానళ్లలోను కాకినాడ కేంద్రంగా ఆయన పనిచేశారు. ఐదు దశాబ్దాల పాటు పాత్రికేయరంగానికి అప్పారావు సేవలందించారు. ఆయన మృతికి వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. అమలాపురం మండలం రోళ్లపాలెంలో అప్పారావు భౌతికకాయాన్ని ఉంచారు.

ప్రకృతి వ్యవసాయం ప్రశంసనీయం

తూర్పుగోదావరి జిల్లా కాపవరం, ముక్కామలలో బ్రెజిల్ ప్రతినిధుల బృందం పర్యటన



కాపవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలిస్తున్న బ్రెజిల్ ప్రతినిధులు



ముక్కామలలో డ్రోన్‌తో ప్రకృతి కషాయాల పిచికారి పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కొవ్వూరు/పెరవలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను బ్రెజిల్, యుఏఈ, శ్రీలంకకు చెందిన 30 మంది నిపుణుల బృందం సందర్శించారు. జర్మనీకి చెందిన అంతర్జాతీయ వ్యాపారవేత్త, నౌసంస్థ సీఈవో వాల్టర్ లింక్, బ్రెజిల్ మంత్రిత్వశాఖకు చెందిన వివియన్, సాండ్రో, 30 మంది ప్రతినిధుల బృందం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు విచ్చేసిన విదేశీ ప్రతినిధుల బృందాన్ని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక బృందం పెరవలి మండలం ముక్కామల, రెండో బృందం కొవ్వూరు మండలం కాపవరం గ్రామాల్లో పర్యటించి రైతు సాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా బాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) వినూత్న నమూనాలను పరిశీలించారు. ముక్కామలలో అన్నపూర్ణా నాన్ పెస్టిసైడల్ మేనేజ్‌మెంటు షాపు వద్ద ప్రకృతి వ్యవసాయ 9సార్వత్రిక సూత్రాల చక్రాన్ని సందర్శించారు. అనంతరం ఘనజీవామృతం, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ విధానం, వినియోగం, నిల్వ చేయడంపై అవగాహన కల్పించారు. జి.వెంకటేశ్వర్లు నిర్వహిస్తున్న డ్రమ్ సీడర్‌తో వరి సాగును వీక్షించారు. కలుపునియంత్రణ, కూలీలఖర్చు తగ్గింపు, సమయపాలన వంటి ప్రయోజనాలను అడిగితెలుసుకున్నారు. పి.రామకృష్ణ నిర్వహిస్తున్న పామ్‌ఆయిల్, వక్క, అరటిసాగు నమూనాలను పరిశీలించి ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్‌ను అడిగి తెలుసుకున్నారు. రెండో బృందం కాపవరంలో ప్రకృతి వ్యవసాయం 9సార్వత్రిక సూత్రాల చక్రం, వాటి అమలును పరిశీలించారు. 13 ఎకరాల హార్టీకల్చర్ పాలీక్రాపింగ్ క్షేత్రాన్ని సందర్శించారు. వ్యవసాయ సూత్రాలను అనుసరించడం, సౌరశక్తి వినియోగం ద్వారా చీడపీడల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను ప్రయోగించడం, పంట వైవిధ్యంతో సస్యశ్యామలంగా కనిపిస్తున్న పొలం అడవిని తలపిస్తుందని బృందం సభ్యులు ప్రశంసించారు. సైన్స్ అండ్ అకాడమీ థీమాటిక్ లీడ్ సుధాకర్ నేతృత్వంలో ప్రతినిధులు రైతు శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించడంలో వారి పాత్రను ప్రశంసించారు. ధర్మవరంలో గోపాలకృష్ణ ఎనీ టైం మనీ నమూనా, వీర మణికంట డ్రం సీడర్ వరిసాగును సందర్శించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాదవరావు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు ప్రారంభం

అంతర్వేది, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి- నర్సాపురంలో రేవులో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి పంటు రాకపోకలు పునఃప్రారంభించారు. ఇటీవల వరదల కారణంగా గత వారం రోజులుగా పంటు రాకపోకలు నిలుపుదల చేశారు. వరద ఉధృతి తగ్గడంతో ప్రయాణికుల సౌకర్యార్థం పంట్లను శుభ్రపరిచి రాకపోకలను ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే సఖినేటిపల్లి రేవు రాకపోకలు నిలిచిపోవడంతో చించినాడ వంతెన మరమ్మతులు జరుగుతుండగా భారీ వాహనాలకు అనుమతులు లేకపోయినా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు, చిన్నకార్లు,బాటసారులకు అనుమతులున్నాయి.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన కాకినాడ పోలీసులు

కాకినాడ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు భారమవ్వకూడదని తనువు చాలించాలనుకుంది ఆ తల్లి. మృత్యువుకు దగ్గరగా వెళ్తున్న పోలీసులు రక్షించి కుటుంబీకులకు అప్పగించారు. వివరాలోకి వెళితే.. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన 58 ఏళ్ల వాసిరెడ్డి లక్ష్మీతులసికి కుమారుడు సుబ్రహ్మణ్యం, కుమార్తె భవాని ఉన్నారు. ఆమె భర్త కొంతకాలం క్రితం మృతి చెందడంతో పిల్లల వద్దే ఉంటుంది. అయితే ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో కుమారుడు, కుమార్తె కలిసి తల్లిని అప్పుడప్పుడు ఆసుపత్రులకు తిప్పడం, మందులు కొనడం చూసి తనకు తిండి పెట్టడమే కాకుండా, వారిపై అదనపు ఆర్థిక భారం పడుతుందని లక్ష్మీతులసి మనోవేదనకు గురైంది. తాను తనువు చాలిస్తే పిల్లలపై ఆర్థిక భారం లేకుండా ఉంటారని భావించింది. తన కుమారినికి నీకు భారం కాకూడదని.. చనిపోతున్నాను నన్ను క్షమించు అని లేఖ రాసి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం లేఖను గుర్తించిన సుబ్రహ్మణ్యం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సీఐ మజ్జి అప్పలనాయుడు బృందంతో కలిసి గాలింపు చేపట్టారు. అయితే ప్రతాప్‌నగర్ సమీపంలోని రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధంగా ఉన్న లక్ష్మీతులసిని రక్షించి ఆమె పిల్లలకు అప్పగించారు. ఆ కుటుంబం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. లక్ష్మీతులసిని రక్షించిన సీఐ బృందాన్ని ఎస్పీ జి.బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.



లక్ష్మీతులసిని రక్షించి అప్పగిస్తున్న సీఐ అప్పలనాయుడు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు కాకినాడలో 'అమృత మంజరి-2' పుస్తకావిష్కరణ

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఐఎంఏ భవనంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు అమృత మంజరి-2 పుస్తకావిష్కరణ జరుగుతుందని మనజ్యోతి ఆశ్రమ సంస్థ నిర్వాహకుడు కేవీఆర్ఎల్ ప్రభాకరరావు తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు మాజీ అధ్యక్షుడు చుండూరి సీతారామంజనేయ ప్రసాద్, ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు, ఏఎస్పీ శ్రీనివాసరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు.


పెద్దాపురంలో ఆటో డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప


కాకినాడలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు


కాకినాడ రూరల్‌లో ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నానాజీ

ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండ

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభోత్సవంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, కొండబాబు, నానాజీ

పిఠాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా అండగా ఉంటుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శనివారం జరిగిన ఆటో డ్రైవర్ల సేవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వారికి ఏ ఇబ్బందులున్నా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని 2012 మంది ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయంగా రూ.3.018 కోట్లను ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, డీసీసీబీ ఇన్‌చార్జి తుమ్మల బాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి కొండలరావులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు, ఏపీడీ వసంతమాధవి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలోని మరిడమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. రాజప్ప మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ఖాతాలో రూ.15వేలు జమ చేస్తున్నామన్నారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు భద్రత కల్పించడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం వారిని ఆటో డ్రైవర్లు సత్కరించారు. నియోజకవర్గ పరిధిలోని 1,657 మంది లబ్ధిదారులకు రూ.2.48 కోట్లు అందించారు. తొలుత ప్రజాప్రతినిధులు ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీగా మరిడమ్మ ఆలయం వద్దకు వచ్చారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి, బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి విత్తనాల వెంకటరమణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియార స్తంభం వద్ద టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో సుమారు 500 మంది ఆటో డ్రైవర్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే స్వయంగా ఆటో నడుపుతూ పెద్దాపురం ప్రదర్శనగా తరలివెళ్లారు. టీడీపీ నాయకులు రాజా సూరిబాబురాజు, బలుసు శ్రీనివాసు, దేవళ్ల జయలక్ష్మి, ఫైండ్ల శ్రీనివాసు, గుమ్మళ్ల రామకృష్ణ, ముసిరెడ్డి శ్రీరాములు, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, గోలి సత్తిరాజు, వల్లూరి దొరబాబు, గొలితి సత్యనారాయణ, బొందల రామలక్ష్మి, సరోజావాసు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం సందర్భంగా శనివారం జగన్నాథపురంలోని ఎమ్మెల్యే నివాసం నుంచి స్మార్ట్ సిటీ కార్యాలయం వరకు ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఖాకీ దుస్తులు ధరించి పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు స్వయంగా ఆటో నడిపారు.


పిఠాపురంలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు వర్మ, దొరబాబు, డీసీసీబీ చైర్మన్ బాబు, జనసేన నేత మర్రెడ్డి, బీజేపీ నేత కొండలరావు

టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్/కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 1,938 మంది డ్రైవర్లకు 2కోట్ల 90 లక్షల 70వేలను వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వెల్లడించారు. స్మార్ట్ సిటీ సమావేశ మందిరం జరిగిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎవరికైనా రూ.15వేలు జమ కాకపోతే సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కమిషనరు భావన.. ఆటో డ్రైవర్లకు మెగా చెక్కు అందించారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, ఆర్డీవో మురళీకృష్ణ, బాలాత్రిపురసుందరి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, సూపర్‌బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. శనివారం ఆయన ఆటో డ్రైవర్లు, కూటమి నాయకులతో కలిసి గొడారిగుంట నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల శుభం కాపు కల్యాణ మండపానికి ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 2,396 మంది లబ్ధిదారులకు రూ.3.59కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఏడాదికి రూ.15వేలు ఇస్తామన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఆటోడ్రైవర్లు పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్, గౌడ, ఎస్సీ కార్పొరేషన్ల డైరెక్టర్లు శిరంగు శ్రీనివాసరావు, ఎం.ప్రకాశ్‌గౌడ్, కె.అప్పారావు, ఎంపీపీ ఎస్.అనంతలక్ష్మి, కూటమి నాయకులు కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), పెంకే శ్రీనివాసబాబా మాట్లాడారు. ఆర్డీవో ఎస్.మల్లిబాబు, ఎంపీడీవో పసుపులేటి సతీష్, ప్రశాంతి, మాదారపు తాతాజీ, సీతయ్యదొర, పలువురు గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతికి శనివారం భక్తులు పోటెత్తారు. శృంగారవల్లభ స్వామికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పదివేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,27,627 లభించినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

పాదగయ హుండీల ఆదాయం రూ.12.91 లక్షలు

పిఠాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవార్ల సమక్షంలోని హుండీలను శనివారం తెరిచి లెక్కించారు. 44 రోజులకు రూ.12,91,120 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయ శాఖ జిల్లా అధికారి కనపర్తి నాగేశ్వరరావు, తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జడ్జికి అమ్మవారి ఫొటో అందజేస్తున్న దృశ్యం

బాలాత్రిపురసుందరి సన్నిధిలో ఏసీబీ కోర్టు జడ్జి

కాకినాడ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యారావుపేటలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరి అమ్మవారిని రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు శనివారం ఉదయం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు ఉత్సవ కమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఫొటో, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ట్రిపుల్ ఐటీ విద్యార్థిని యశస్వినిని అభినందిస్తున్న రామ్‌వీర్-డాక్టర్ నయన దంపతులు

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత

కరప, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద ఐఐటీ విద్యార్థినికి ఆర్థిక చేయూత దొరికింది. కరప గ్రామానికి చెందిన కె.యశస్విని విజయదుర్గ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. నెలవారీ ఖర్చులకు ఇబ్బంది పడుతుండడంతో మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కాకినాడ రోటరీ క్లబ్ ప్రతినిధి అరిగెల వెంకటేశ్వరరావు (పెదబాబి)ను కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన కాకినాడ రీఫ్స్ రెస్టారెంట్ అధినేత ఆర్‌టీఎస్ రామ్‌వీర్-డాక్టర్ నయన దంపతులకు విషయం తెలుపగా వారు స్పందించి తమ కుమారుడి మొదటి పుట్టినరోజు సందర్భంగా సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ప్రతి నెలా రూ.3వేలు చప్పున ఆరేళ్ల పాటు యశస్విని బ్యాంకు ఖాతాకు నేరుగా పంపిస్తామని చెప్పి మొదటి నెల సాయం రూ.3వేలను తక్షణం బదిలీ చేశారు. రామ్‌వీర్-నయన దంపతులకు పెదబాబి, తాతీలు, ఎం.వీరకుమార్, కరప హైస్కూలు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. యశస్వినిని అభినందించి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు వేట్లపాలెం విద్యార్థుల ఎంపిక

సామర్లకోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామోపాధ్యాయుడు యార్లగడ్డ బంగార్రాజు, హెచ్ఎం అనురాధ తెలిపారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి రెజ్లింగ్ బాలురు, బాలికల పోటీల్లో... 55 కిలోల విభాగంలో కె.గౌతమ్ 80 కిలోల విభాగంలో, 55 కిలోల విభాగంలో ఎ.శ్రీధర్, 52 కిలోల విభాగంలో కె.ప్రవీణ్, 65 కిలోల విభాగంలో డి.హారిక, 62 కిలోల విభాగంలో డి.సింధుష సత్తా చాటారు. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని పీడీ బంగార్రాజు చెప్పారు. పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ గుమ్మళ్ల విజయలక్ష్మిరామకృష్ణ అభినందించారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయుడు బంగార్రాజు

రేపు డీసీసీ సమావేశం

కాకినాడ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జిల్లా కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎంఎం పళ్లంరాజు ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఛైర్మన్ కామన ప్రభాకరరావు విచ్చేస్తారన్నారు.

'ప్రయాణికులకు గౌరవ మర్యాదలు ఇస్తూ సమాధానం చెప్పాలి'

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్త్రీ పథకంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు గౌరవ మర్యాదలు ఇస్తూ సమాధానం చెప్పాలని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఆయన ఆర్టీసీ సమాచార కేంద్రం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బస్ స్టేషన్లలో విపరీతమైన రద్దీ కారణంగా సమాచారం కేంద్రం సిబ్బందిపై ఒత్తిడి పెరిగిందన్నారు. ఎటువంటి పరిస్థితిలోనూ ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా వారికి కావాల్సిన సమాచారాన్ని నవ్వుతూ ఓపికగా చెప్పాలన్నారు. డిపో మేనేజరు ఎంవీవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజరు టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజరు వి.ధర్మారావు, వీఆర్వో వెంకట్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో రైతుల ధర్నా

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మొక్కలు ఏపుగా ఎదిగి కాయలు కాసినా పత్తి విచ్చుకోకపోగా ఎండిపోతున్నట్టు మారి చనిపోతున్నాయని చేబ్రోలు, దుర్గాడ, చెందుర్తి, తాటిపర్తి తదితర గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి లక్ష రూపాయలకు పైగా నష్టపోయామని, తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ చేబ్రోలులో విత్తనాలు విక్రయించిన దుకాణం వద్దకు రైతులు శనివారం రాత్రి భారీగా చేరుకుని ఆందోళన చేపట్టారు. దుకాణదారులు, డీలర్లను ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు.

కోర్టుల్లో కేసులను సత్వరం పరిష్కరించాలి: డీఆర్వో వెంకట్రావు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ కోర్టుల్లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సత్వరం పరిష్కరించాలని న్యాయాధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు సూచించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో జిల్లాలో ఉన్న కేసుల పరిస్థితిపై సమీక్షించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎన్ని కేసులు వేశారు... వాటిలో ఎన్ని కేసులకు తీర్పు ఇచ్చారో తెలియజేయాలన్నారు. ఇంకా ఎన్ని కేసులు పెండింగులో ఉన్నాయో వెల్లడించాలని కోరారు. న్యాయాధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రాగి ఐశ్వర్య రక్షణ కంకణాల పంపిణీ



సర్పవరం జంక్షన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్య రక్ష కంకణాలను వ్యవస్థాపకుడు స్వామి పరిపూర్ణానంద సరస్వతి శనివారం సాయంత్రం పంపిణీ చేశారు. 3వ మహాశక్తి యాగంలో భాగంగా జరిగిన వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు కంకణాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఐడీ కార్డులు ఉండి, హాలోగ్రామ్ స్టిక్కర్ వేయించుకున్న వారికి తొలుత కంకణాలు పంపిణీ చేస్తామన్నారు. తర్వాత మిగిలిన వారికి అందిస్తామని చెప్పారు.



'ఆత్మ' మాజీ చైర్మన్ రాంబాబు మృతి



పెద్దాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మ' మాజీ చైర్మన్ కలకపల్లి రాంబాబు (రాము) శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. రాము మృతికి పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారికి సీరియస్

పిఠాపురం సీఎంసీ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

పిఠాపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని సీఎంసీ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమకు పుట్టిన శిశువు పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆరోపిస్తూ బంధువులు శనివారం రాత్రి 10గంటల సమయంలో ఆందోళనకు దిగారు. దీంతో ఆసుపత్రి వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పట్టణానికి చెందిన సిద్దనాతి భాస్కరలక్ష్మి డెలివరీ నిమిత్తం ఆసుపత్రిలో చేరగా ఈ నెల ఒకటో తేదీన సిజేరియన్ ఆపరేషన్ చేస్తే మగ శిశువు జన్మించాడు. బాబుకి ఫిట్స్, జాండిస్ రావడంతో చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో పట్టణంలోని తల్లీపిల్లల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ రిఫర్ చేశారు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా వెంటిలేటర్‌పై చికిత్స చేస్తున్నారు. సీఎంసీ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని బంధువులు తరలివచ్చి ఆందోళన చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఆందోళన చేస్తున్న చిన్నారి బంధువులు

ఖాదీ బోర్డు డైరెక్టర్‌కు సన్మానం

ప్రత్తిపాడు, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుకు చెందిన ఖాదీబోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబును శనివారం స్థానిక మున్సిబ్ వారి రామాలయ వద్ద కనకదుర్గ ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. ప్రత్తిపాడు ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయనను పలువురు కోరారు. సింగిలిదేవ్ అప్పారావు, చిలకమర్తి వెంకట్రావు, మదినేదొరబాబు, రావూరి తాతాజీ, పోలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఆటోడ్రైవర్ల ఆర్థికాభివద్ధికి చర్యలు

- ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శిరీషదేవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రంపచోడవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్ల ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఆటోడ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవానికి ఆమెతో పాటు సబ్ కలెక్టర్ శుభం నక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమిటీ డైరెక్టర్ దేబోరా సునీత, రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ పెద్దిరాజు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, రాష్ట్ర మైనార్టీ డైరెక్టర్ షేక్‌సుభానీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాబ్, ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రంపచోవరం, చింతూరు డివిజన్ల లోని 11 మండలాల్లో 1,355 మంది ఆటో డ్రైవర్లకు రూ. 2 కోట్ల 3 లక్షల 25 వేలు ఖాతాలలో జమ జేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శీతం శెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, బీజేపీ నాయకులు స్వప్నకుమారి, పల్లాల కృష్ణారెడ్డి, లక్ష్మి, ఏపీవో(జీ) డీఎస్వీ రమణ, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు యాదవ్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్‌కుమార్, బీ.చెల్లారావు, ఎంపీడీవో వై.రాజబాబు, స్థానిక నాయకులు పి.అనంతమోహన్, నిరంజనీదేవి, కనిగిరి రాంబాబు, పాము అర్జునుడు, మాగాపు బాబూరావు, అడబాల బాపిరాజు, జనసేన నేతలు కుర్ల రాజశేఖర్ రెడ్డి, పి.శ్రీనివాసరావు, బుద్ద వెంకన్నబాబు, పండా చెల్లన్నదొర, జమల్‌ఖాన్, సీఐ పీఎస్. సన్యాసినాయుడు, ఏపీడీ డేగలయ్య, బీఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ఆటోడ్రైవర్ల సేవలో పథకంలో భాగంగా మండలంలోని ఆటో డ్రైవర్లకు శనివారం వారి ఖాతాలలో రూ. 15 వేలు వంతున జమయ్యాయి. చింతూరు ఆటో యూనియన్ నాయకుల నేతృత్వంలో సెంటర్‌లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మాధవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆటో యూనియన్ నాయకులు కట్టా శంకర్, పయ్యాల నాగేశ్వరరావు, మురళి, పతే అహ్మద్, చంద్రం, టీడీపీ మాజీ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి నాయకులు నూకాచారి, ఆసిఫ్, వాస శ్రీరామరెడ్డి , సాయిబాబా, శీలం తమ్మయ్య, సోడె సత్యవతి పాల్గొన్నారు.

దేవీపట్నం: శరభవరం సచివాలయ ఆవరణలో ఆటోడ్రైవర్ల సేవలో పథకం లబ్ధి పొందిన ఆటో డ్రైవర్లంతా కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలకు శనివారం పాలాభిషేకం చేశారు. చిక్కాల బూరయ్య, జోగి చిన్న కాసు, జోన్నల నాని, వైష్ణవదాసు నాని, తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరంలో అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

వై.రామవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చాకలి వీధి దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శరన్నవరాత్రుల ముగింపు ఉత్సవంలో భాగంగా ఉత్సవ నిర్వాహకుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రంపచోడవరంలో గ్రామసభ

రంపచోడవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గ్రామపంచాయతీలో సర్పంచ్ మంగ బొజ్జయ్య ఆధ్యక్షతన శనివారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో పలు సమస్యలపై చర్చించి తీర్మానించారు. సమావేశంలో ఉప సర్పంచ్ వెంకట మెరుగు కన్నబాబు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి బీ.కామరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

దేవీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ నిరుద్యోగులతోనే 100 శాతం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ అమలు చేసి తక్షణమే ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి టీఏసీ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, లేకుంటే శాంతియుత ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ఈమేరకు ఈనెల 13న రంపచోడవరం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. మిర్తివాడ సాయికిరణ్ రెడ్డి, మిర్తివాడ సూరారెడ్డి, చవలం విద్యాసాగర్, సారపు నవీన్ కుమార్, కారం రంగారావు దొర, కుంజం శ్రీనివాసు దొర, కొమరం గణేష్ దొర, తుర్రం రమేష్ దొర, తుర్రం రామకృష్ణ దొర, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

మోతుగూడెం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు ఆరో తేదీ నుంచి ఆందోళనబాట పడుతున్నారు. దీనికి సంబంధించి లోయర్ సీలేరు సీఈకి ఉద్యోగ సంఘాల నేతలు శనివారం స్ట్రైక్ నోటీసు ఇచ్చారు. విశాఖపట్నంలో ఆరో తేదీన ధర్నా, తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ముందు ఎనిమిదో తేదీన ధర్నా, 14వ తేదీన వర్క్ టు రూల్, 15వ తేదీన నిరవధిక సమ్మె చేయాలని షెడ్యూల్ నిర్ణయించుకున్నారు.

గండిపోశమ్మ దర్శనాలు నిలుపుదల

దేవీపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గండి పోశమ్మ ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగిందని ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆలయ పరిసరాల్లోకి ఎవరూ రావద్దని వారు పేర్కొన్నారు.

రంపచోడవరంలో అమ్మవార్ల ఊరేగింపు

రంపచోడవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక స్టేట్ బ్యాంక్, దేవీ గుడి సెంటర్‌లో ఉన్న కనకదుర్గమ్మ విగ్రహాలను లారీ ఓనర్లు, వర్కర్స్ మోటార్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు కృషి







జగ్గంపేట:ఆటో డ్రైవర్లకు చెక్ అందజేస్తున్న జ్యోతుల నవీన్, ప్రత్తిపాడు: గజ్జెనపూడి నుంచి తరలి వెలుతున్న టీడీపీ నాయకులు, తునిలో నగదు చెక్కును అందిస్తున్న కూటమి నాయకులు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్
- ఆటో డ్రైవర్లకు చెక్కుల పంపిణీ

జగ్గంపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆటో డ్రైవర్ల అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ ద్వారా కృషి చేస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంనుంచి ఆటో డ్రైవర్లతో కలిసి జ్యోతుల నవీన్ ఆటో నడుపుతూ ర్యాలీగా మండల ఆఫీసుకి చేరుకున్నారు. అక్కడ టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా నవీన్ హాజరై ఆటో డ్రైవర్లకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,688మందికి ఈపథకం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఇంకా 139మంది అనర్హుల జాబితాలో ఉన్నారని, వారికి కూడా న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణకు సూచించారు. ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు రూ.15వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రైవర్లకు రూ.2.20 కోట్ల చెక్కు అందజేత

తుని రూరల్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే యనమల దివ్య కేరళ పర్యటనలో ఉండడంతో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస థియేటర్ సెంటర్ నుంచి రాజా కళాశాల గ్రౌండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం రాజా కళాశాలలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), టీడీపీ సీనియర్ నాయకుడు సుర్ల లోవరాజు, యినిగంటి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వంపనిచేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబుతో కలిసి యనమల రాజేష్ 1472మంది లబ్ధిదారులకు రూ.2.20కోట్ల నగదు చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, జక్కాన రాము నాయుడు, ఆవుగడ్డి వెంకటరమణ, కాలిబోయిన గంగారావు, ఆటోడ్రైవర్ల ప్రెసిడెంట్, టీడీపీ సీనియర్ నాయకుడు ములికి సూరిబాబు, దంతులూరి శ్రీనివాస రాజు, కోడా వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, గంట్ల చిన్నారావు ఉన్నారు.

గ్రామాల్లో ఆటో డ్రైవర్ల ర్యాలీ

ప్రత్తిపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆటో డ్రైవర్లు శనివారం భారీ ర్యాలీలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకం చేపట్టి రూ.15వేలు చొప్పున మంజూరు చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ధర్మవరం, ప్రత్తిపాడు, రాచపల్లి, గజ్జెనపూడి, శరభవరం, ఏలూరు, పెదశంకర్లపూడి తదితర గ్రామాల నుంచి ఆటో డ్రైవర్లు ర్యాలీలు నిర్వహించారు. ఏలేశ్వరంలో ఎమ్మెల్యే సత్యప్రభ ఆధ్వర్యంలో మంత్రి నారాయణ పాల్గొనే ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవానికి తరలివెళ్లారు.

ఏలేశ్వరానికి భారీగా తరలివెళ్లారు

రౌతులపూడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమానికి మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. మూలగపూడి నుంచి టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ యామల సురేష్, రౌతులపూడి నుంచి టీడీపీ యువ నాయకులు ఇటంశెట్టి అశోక్, పైల అశోక్, బలరామపురం నుంచి కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు మౌళి, సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు, ఎంపీటీసీ సోమరౌతు రవి, పారుపాక నుండి కోసూరి కృష్ణ వర్మ, గుమ్మరేగుల నుండి పసగడుగుల రమణ తదితర గ్రామాల నుంచి భారీగా తరలివెళ్లారు.

చిరుధాన్యాల సాగు రైతులకు ప్రయోజనకరం

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్



శంఖవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగు రైతులకు ప్రయోజనకరమని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం సీతంపేటలో వ్యవసాయశాఖ జిల్లా చిరుధాన్యాల మేళా నిర్వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటూ ఆహారభద్రత కల్పించవచ్చన్నారు. చిరుధాన్యాలు పండిస్తే గిట్టుబాటు ధరతో తీసుకుంటామని హామీఇచ్చారు. రాగి, కొర్ర, జొన్న, సజ్జ, సాములు, అరికల యాజమాన్య పద్ధతులు వివరించారు. రైతుల సమస్యలు తెలుసుకుని వాటిని నివృత్తి చేశారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలు, వాటి విత్తనాలను ప్రదర్శనకు పెట్టి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఏలియాజర్, మాలకొండయ్య, ఏవోలు పి.గాంధీ, చంద్రశేఖర్, అమృత, సుధమాధురి పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో అమ్మవారిని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు

ముగిసిన దేవీ నవరాత్రులు

ఏలేశ్వరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రులు ముగియడంతో పట్టణంలో అమ్మవారి విగ్రహాలు నిమజ్జనం చేశారు. శనివారం లింగవరం కాలనీలో జేవీఆర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు, వీర్రాఘవమ్మ దంపతుల ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం, తోటవీధి, సువ్వయ్యమ్మపేట, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయాల వద్ద దుర్గాదేవి విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణ వీధుల్లో ఊరేగించి ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి



నిరసన తెలుపుతున్న రైతుకూలీ సంఘం నాయకులు

జగ్గంపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట శివారు రామవరం పంచాయతీ పరిధిలోని రంగవల్లినగర్‌లో నివసిస్తున్న ఎరుకల కులానికి చెందినవారిపై రామవరానికి చెందిన అగ్రవర్ణాలవారు దాడి చేసిన ఘటనలో దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో చలో కాకినాడ కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపు ఇచ్చినట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. శనివారం రంగవల్లినగర్‌లో ఈవిషయంపై బాధితులు వారి మద్దతుదారులతో సమావేశమయ్యారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్‌కి వినతిపత్రం ఇస్తామన్నారు. సోమరాజు, శ్రీను, శివ, శ్రీరామ్, లక్ష్మి, చంద్రమ్మ పాల్గొన్నారు.

రోడ్ మెటల్ క్వారీ నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీవో

రౌతులపూడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్ మెటల్ నిర్వాహణకు ఎస్. పైడిపాల గ్రామంలో అధికారులు ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. హుబర్ట్ ఎన్విరో కేర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి చోడే సురేష్ సర్వేనెంబర్ 1-1పిలో 28.76 హెక్టార్లలో క్వారీ లీజుకు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఏఎస్‌ఆర్వీ మూర్తి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడూతూ ప్రత్యేక్షంగా, పరోక్షంగా వంద మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. సీఎస్ఆర్ నిధులు రూ.20లక్షలతో ఆసుపత్రి నిర్మాణం, పారుశుద్య పనులు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వ్యవసాయాలు పంటలపై దూళి పడకుండా నిత్యం వాటరింగ్ చేయాలని, సంస్థ ఇచ్చిన హామీలన్ని నేరవే ర్చాలని కోరారు. తహశీల్దార్ ఎన్వీ నరేష్, సర్పంచ్ జిగిరెడ్డి సత్తిబాబు, కత్తిపూడి సత్రం చైర్మేన్ సోమరౌతు చంద్రమౌళి, ఈగల సత్తిబాబు పాల్గొన్నారు.

అమ్మవారి నిమజ్జనాలు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

గండేపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా మండలంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గమ్మతల్లి విగ్రహాలను శనివారం నిమజ్జనాలు చేశారు. గండేపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం ప్రక్కన్న ఏర్పాటు చేసిన శ్రీవిజయ దుర్గభవాని అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు


సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి భాజాభజంత్రీల మధ్య తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తుల గోవిందనామ స్మరణలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడ పైనుంచి పడి మహిళకు గాయాలు

అన్నవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరికొండపై ఉన్న విష్ణుసదన్ హాల్ మూడో అంతస్తు నుంచి శుక్రవారం అర్ధరాత్రి జారిపడి మహిళకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మలికిపురానికి చెందిన పెళ్లి బృందంలో ఒక మహిళ బిడ్డకు అన్నం తినిపిస్తుండగా జారి మేడపై నుంచి ఇద్దరూ పడిపోయారు. చిన్నారికి గాయాలు తగలకపోగా మహిళకు రెండుకాళ్లు విరిగిపోయాయి. అంబులెన్స్‌లో తుని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తీసుకెళ్లారు.

అరుణాచలేశ్వర ఆలయంలో అయ్యప్పదీక్షలు ప్రారంభం




అయ్యప్ప మాలధారణ చేపట్టిన భక్తులు

ప్రత్తిపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప దీక్షలను ప్రారంభించారు. ఆశ్వయుజ మాసం శుక్లపక్ష ద్వాదశి పర్వదినం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి మాలలు ధరించారు. అరుణాచలేశ్వరునికి వారు పూజలు జరిపారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థికి ఎంఈవో అభినందన

ఏలేశ్వరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లింగంపర్తి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి మారుకుర్తి లక్ష్మీ ప్రసన్న నవోదయకు ఎంపిక కావడతో శనివారం ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో బి.అబ్బాయి ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు ఎమ్.గిరీశ్వరరావు, రాజు, తాతారావు, రవి, రాజు, పద్మ పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో విద్యార్థి ప్రసన్నను అభినందిస్తున్న ఎంఈవో అబ్బాయి